మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ పుష్పన్, ఎస్ రాము తదితరులు

తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ పుష్పన్

అల్విన్‌కాలనీ: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ పుష్పన్ అన్నారు. కూకట్‌పల్లి సర్కిల్ అల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శంషీగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు చాక్లెట్ల పేరుతో అందించే మత్తు పదార్థాలను తీసుకోకూడదని సూచించారు. సిగరెట్లు, గంజాయి, హుక్కా వంటి పదార్థాల వల్ల అనారోగ్యంతో పాటు కుటుంబ కలహాలు పెరుగుతాయన్నారు. ప్రతి విద్యార్థి మత్తు పదార్థాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని డ్రగ్స్ నిషేధిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుందన్నారు. జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ రాము నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

బాలానగర్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బాలానగర్ డివిజన్ కల్యాణినగర్‌లో, ఫతేనగర్ డివిజన్‌లోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో, కూకట్‌పల్లిలోని శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ భువనేశ్వరి ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం హాజరై పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పుష్పారెడ్డి , మాజీ కార్పొరేటర్ కృష్ణగౌడ్, కంచి మహేందర్, ఫతేనగర్ డివిజన్ అధ్యక్షులు కుక్కల రమేష్, బోయినపల్లి డివిజన్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షులు మేకల రమేష్, రాజు, ఆలయ కమిటీ చైర్మన్‌లు నరసింహారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమపేరుతో మోసం.. చంపుతానని బెదిరింపులు

వెంగళరావునగర్: ప్రేమ పేరుతో యువతిని మోసం చేయడమే కాకుండా చంపుతానని యువకుడు బెదిరిస్తున్న ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కనిగిరి ప్రాంతానికి చెందిన యువతి మధురానగర్‌లో ఉంటూ మూడేళ్లుగా ప్రైవేట్ జాబ్ చేస్తోంది. కొన్ని నెలల తర్వాత యువతి పనిచేసే చోట జాబ్ చేస్తున్న బోరబండ నివాసి ఎల్.నవీన్‌తో ప్రేమలో పడింది. ఇరువురు ప్రేమించుకోవడంతో ఆమె పేరుమీద రూ.2 లక్షల లోన్ తీసుకున్నాడు. 3 నెలలు చెల్లించి తర్వాత చెల్లించకపోవడంతో ఆమె అడిగింది. దాంతో ఆమెను దూషిస్తూ, ఇతరులతో సంబంధం కలుపుతూ, కొట్టాడు. గతంలో బోరబండలోని హాస్టల్‌కు తీసుకెళ్లి లైంగికదాడికి యత్నించగా ఆమె బోరబండ, సనత్‌నగర్ పీఎస్‌లలో ఫిర్యాదు చేసింది. అరెస్టు చేసి 3 నెలలు జైలుకు పంపారు. తిరిగి వచ్చిన తర్వాత సఫిల్‌గూడలో ఉంటున్న తన సోదరుడికి ఫోన్ చేసి చంపుతానని బెదిరించాడు. ఈ విషయంపై బోరబండ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా బెదిరించి పంపారు. తిరిగి ఇటీవల తరచూ ఆ యువతి, ఆమె సోదరుడికి ఫోన్లు చేసి చంపుతానని బెదిరిస్తున్నాడు. దాంతో బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వచ్చేనెల 3 నుంచి ఓయూ స్విమ్మింగ్‌పూల్ షురూ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని స్విమ్మింగ్‌పూల్ మార్చి 3 నుంచి ప్రారంభం కానున్నట్లు ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.రాజేశ్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5.40 వరకు స్విమ్మింగ్‌పూల్ తెరిచి ఉంటుందన్నారు. ఓయూ విద్యార్థులు, ఉద్యోగులతో పాటు బయటి వ్యక్తులు సైతం ఈత కొట్టవచ్చని పేర్కొన్నారు. అలాగే ఈత వచ్చేవారు, నేర్చుకోవాలనుకునే వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ. 13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 13, క్యాప్సికం 35, పచ్చకాకర 35, పందిరి బీర 40, క్యాబేజీ 9, క్యారెట్ 17, దొండ 40, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 28, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 32, ఆలుగడ్డ 43, చామగడ్డ 43, మొరంగడ్డ 35, కందగడ్డ 65, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

బీసీ బిడ్డనే అయినా.. మద్దతు లేదు



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

పంజగుట్ట: జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ సంఘాల నాయకులు, మేధావులు డబ్బున్న బీసీ అభ్యర్థులకే మద్దతు ప్రకటించడం దారుణమని కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి, తెలంగాణ గ్రాడ్యుయేట్స్ ఫోర్స్ వ్యవస్థాపకులు డాక్టర్ బండారి రాజ్‌కుమార్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను బీసీ బిడ్డనే అయినప్పటికీ బీసీ సంఘాల నాయకులు, మేధావులు తనకు మద్దతు ఇవ్వకుండా డబ్బున్న వ్యక్తులకే ఇవ్వడం బాధాకరమన్నారు. వారిమధ్య చీకటి ఒప్పందం ఏమైనా జరిగిందా, డబ్బులు తీసుకుని మద్దతు ఇస్తున్నారా..? అని ప్రశ్నించారు. ఇప్పుడు పోటీలో ఉన్నవారంతా కార్పొరేట్ శక్తులే అని, వారిని తరిమికొట్టి ప్రజా సమస్యలు తెలిసిన తన సీరియల్ నంబర్ 37పై ఓటువేసి గెలిపించాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ కృష్ణ ప్రియ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువత మానసిక ధృడత్వాన్ని పెంపొందించుకోవాలి

బన్సీలాల్‌పేట్: యువత మానసిక ధృడత్వాన్ని పెంపొందించుకోవాలని తెలంగాణ సైకాలజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎం.ఏ. కరీం అన్నారు. సికింద్రాబాద్ బోట్స్ క్లబ్ యూత్ హాస్టల్ ఆవరణలో యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మానసిక అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం ఉంటేనే యువత ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. యువత తమ లోపాలను విమర్శలను సానుకూలంగా తీసుకున్నప్పుడే తమ వ్యక్తిత్వాన్ని విజయం వైపు మలుచుకోగలరని సూచించారు. అనంతరం యువత మాదకద్రవ్యాల వైపు వెళ్లకుండా తెలంగాణ సైకాలజికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హెల్ప్‌లైన్ లోగోను ఆవిష్కరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు హెల్ప్‌లైన్ నంబర్ 9440488571, 040–35717915 లకు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా యువజన అధికారి ఖుష్బూగుప్తా, ప్రోగ్రాం అధికారి యాదగిరితో పాటు తమిళనాడు యువకులు పాల్గొన్నారు.

శివపూజకు వేళాయే..

- భక్తులకు ఏర్పాట్లు పూర్తి
- విద్యుత్ దీపాలతో ఆలయాల అలంకరణ



మూసాపేటలోని విశ్వేశ్వర స్వామి ఆలయం

మోతీనగర్: అల్లాపూర్, మూసాపేట డివిజన్‌లలోని శివాలయాల్లో బుధవారం శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, స్వామివారి కల్యాణం, అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయా ఆలయ కార్యనిర్వాహణాధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్వత్‌నగర్‌లోని పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం సాయంత్రం 6.30 గంటలకు పార్వతీ, పరమేశ్వర కల్యాణం, పల్లకీ సేవ, రాత్రి 10 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో భస్మాభిషేకం, శివభజన, హారతి, తీర్థప్రసాద వితరణ ఉంటుందని ఆలయ కమిటీ తెలిపింది. శివ రామాంజనేయ స్వామి ఆలయంలో ఉదయం 4.30 గంటలకు ప్రాతఃకాల చందనాభిషేకం, రుద్రాభిషేకాలతో శివరాత్రి వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు. 12 గంటలకు మహా రుద్రాభిషేకం, 6 గంటలకు 11 రకాల ద్రవ్యాలతో రుద్రాభిషేకం, 25 వేల రుద్రాక్షలతో అభిషేకం, 9 గంటలకు శివపార్వతుల కల్యాణం, రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాల అభిషేకం, 27న మధ్యాహ్నం అన్న సమారాధన ఉంటుందని పేర్కొన్నారు. మోతీనగర్‌లోని శృంగేరి శారదా శంకరమఠంలో మహా శివరాత్రి సందర్భంగా చంద్రమౌళీశ్వర స్వామి వారికి బుధవారం ఉదయం 7.30 నుంచి 11 గంటల వరకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు మహన్యాస పూర్వక ప్రదోషకాల ఏకవార అభిషేకం, రాత్రి 8.30 నుంచి 10 గంటల వరకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, రాత్రి 10.30 నుంచి 12.30 గంటల వరకు చంద్రమౌళీశ్వర స్వామి వారికి భస్మాలంకారం, గురువారం ఉదయం 8 గంటలకు చంద్రమౌళీశ్వర స్వామి వారికి భస్మాలంకారం, ఉదయం 10 గంటలకు మహా మృత్యుంజయ సంపుటిత రుద్రహోమం పూర్ణాహుతి అనంతరం మహా మంగళహారతి వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

మూసాపేట: మహా శివరాత్రి పర్వదినాన్ని నిర్వహించేందుకు కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆలయ నిర్వాహకులు ఆలయాలను అలంకరించారు. విద్యుత్ దీపాలు, రంగులు, పూల తోరణాలతో అందంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఉదయం 4 నుంచి అభిషేకాలు, రుద్ర హోమం, రాత్రి 9.30 గంటలకు కాశీ విశాలాక్షి సమేత విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. మూసాపేటలోని పాప నాశేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు రాత్రి 9 గంటలకు శివపార్వతుల కల్యాణం జరుగనుంది.

నివాళులర్పించిన ఎమ్మెల్యే

మోతీనగర్: కూకట్‌పల్లి నియోజకవర్గం, మూసాపేట డివిజన్ మోతీనగర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాము నాయక్ మాతృమూర్తి గున్నీబాయి సోమవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్‌తో కలిసి కుటుంబాన్ని ఓదార్చారు. మృతదేహంపై పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, బీసీ సెల్ అధ్యక్షులు నాగుల సత్యం, మూసాపేట డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తన్నీరు తిరుపతి రావు, నాయకులు కె. రాజ్‌కుమార్ గౌడ్, చక్రపాణి, ఎంసీహెచ్ఎస్ మాజీ అధ్యక్షులు నలమాల్పు అంజిరెడ్డి, సభ్యులు సుబ్బారావు, రమణ పాల్గొన్నారు.

లింగంపల్లి రైల్వే స్టేషన్‌ను సందర్శించిన జీఎం

శేరిలింగంపల్లి: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ మంగళవారం లింగంపల్లి రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ రీ మోడలింగ్ పనులను అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తాడిబోయిన రామస్వామియాదవ్ లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల అవసరాలకు తగ్గట్లుగా వసతులు పెంచాలని అరుణ్‌కుమార్‌ను కోరారు. ముఖ్యంగా ఈ స్టేషన్ మీదుగా వెళ్ళే హుస్సేన్‌సాగర్, రాజ్‌కోట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలని, పల్నాడు ఎక్స్‌ప్రెస్‌ను తెనాలి వరకు పొడిగించడం, జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను దుగ్గిరాలలో ఆపాలని వినతిపత్రం అందజేశారు. అదే విధంగా స్టేషన్‌లో వికారాబాద్ వైపు ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి ప్లాట్ ఫారం 4లో లిఫ్ట్ ఏర్పాటు చేయాలని కోరారు. సికింద్రాబాద్ వైపు 1,2 ప్లాట్‌ఫారాలను కలుపుతూ లిఫ్టులతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలన్నారు. ఎంఎంటీఎస్ రైళ్ళను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు నడపాలని కోరారు.

కుమార్తెను వేధించిన వ్యక్తిపై ఫిర్యాదు

వెంగళరావునగర్: కుమార్తెను వేధించిన వ్యక్తిపై తల్లి మధురానగర్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. స్థానికంగా నివసించే మహిళకు 2010లో వనపర్తికి చెందిన వ్యక్తితో వివాహమైంది. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు. అందరూ వనపర్తిలోనే నివాసం ఉంటున్నారు. గతేడాది నవంబరులో ఆమె పెద్ద కుమార్తె భయంగా ఉండటంతో ఏం జరిగిందని తల్లి ప్రశ్నించింది. వారి ఇంటికి తరచూ వస్తున్న తండ్రి స్నేహితుడైన ప్రశాంత్ అనే వ్యక్తి తనను శారీరకంగా వేధించాడని తెలిపింది. దీంతో ప్రశాంత్‌ను నిలదీయగా.. తానే ఇలా చేశానని, తనపై కేసు పెడితే తల్లీకుమార్తెలను చంపుతానని బెదిరించాడు. దీంతో ఆమె మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. మధురానగర్ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్‌తో కేసు నమోదు చేసి వనపర్తికి బదిలీ చేశారు.

కలెక్టరేట్‌లో ఉద్యోగుల ‘2కే వాక్’



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: ఆర్థిక అక్షరాస్యత వారోత్సవంలో భాగంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం మైదానంలో అధికారులు, ఉద్యోగులు 2కే వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా మహిళల్లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించేందుకు ఆర్బీఐ సూచనల మేరకు కలెక్టరేట్‌లో ‘2కే వాక్’ నిర్వహించినట్లు చెప్పారు. మహిళా శ్రేయస్సు లక్ష్యంగా ఆర్థిక ప్రణాళిక, సూక్ష్మ పొదుపులు, నష్టాల తగ్గింపుపై దృష్టి సారించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికార వర్గాలు ప్రకటించాయి. ఆర్డీఓ హరిప్రియ, జిల్లా లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు వినోద్‌కుమార్, ఝాన్సీరాణి, స్వర్ణలత, సాంబశివరావు, రాంమ్మోహన్, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

బస్టాప్‌ను పునరుద్ధరించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజాంపేట్: రాజీవ్ గాంధీ నగర్ మెయిన్ రోడ్డు కేపీఎస్ ఫ్రెష్ ఉమా హైట్స్ ముందు ఉన్న బస్టాప్‌ను కొంతమంది ఆక్రమించి షాపులు నిర్వహిస్తున్నారని, ప్రజా అవసరాల కొరకు బస్టాప్‌ను పునరుద్ధరించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలను గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సాబేర్ అలీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో గల 16, 20వ డివిజన్‌లకు సంబంధించిన బస్టాప్ 30 సంవత్సరాల నుంచి వినియోగంలో ఉందన్నారు. గత 4 నెలల నుంచి కొంతమంది బస్టాప్‌ను తొలగించి టిఫిన్ సెంటర్, టీ పాయింట్ తదితర వ్యాపారాలు కొనసాగిస్తున్నారని వివరించారు. దీని వల్ల బస్టాప్ లేక ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు మహేందర్, ఏసు, ఖాదరయ్య, రమణ, కేశవ్ పాల్గొన్నారు.

బాలుడిని ఎత్తుకెళ్లిన వ్యక్తుల రిమాండ్

- పిల్లలు లేరని అపహరణ
- పోలీసులు దర్యాప్తులో వెల్లడి



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ సురేష్‌కుమార్

జీడిమెట్ల: ఫుట్‌పాత్‌పై తల్లిదండ్రుల వద్ద నిద్రిస్తున్న బాలుడిని ఎత్తుకెళ్లిన కేసులో సనత్‌నగర్ పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం బాలానగర్ డీసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో డీసీపీ కె.సురేష్‌కుమార్ ఏసీపీ హన్మంతరావు, సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. కలివెల గీత, రాధేయ భార్యాభర్తలు సనత్‌నగర్‌లో స్క్రాప్ ఏరుకుని జీవనం సాగిస్తుంటారు. ఎప్పటిలాగే ఈనెల 23వ తేదీన వారు తమ 8 నెలల బాబుతో శివాలయం రోడ్డులోని ఫుట్‌పాత్‌పై నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి తర్వాత లేచి చూసేసరికి బాబు కనిపించలేదు. దీంతో వారు సనత్‌నగర్ పోలీసులు ఫిర్యాదు చేశారు. అనంతరం డీసీపీ పర్యవేక్షణలో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. నిందితులు ముందుగానే పాలడబ్బా కొన్నట్టుగా గుర్తించారు. ఈ కోణంలో విచారణ జరపగా.. బిహార్‌కు చెందిన భార్యాభర్తలు సత్యనారాయణ, శోభాదేవిలకు పిల్లలు లేరు. దంపతులు ఫుట్‌పాత్‌పై పసికందుతో పడుకోవడాన్ని గమనించి బాబును ఎత్తుకెళ్లాలని ప్లాన్ చేశారు. అనుకున్నట్లుగానే సత్యనారాయణ, అతని అనుచరుడు సన్నికుమార్ పాండేతో కలిసి ఈనెల 23వ తేదీన బాలుడిని ఎత్తుకెళ్లారు. సత్యనారాయణ, శోభాదేవి దంపతుల వద్ద నుంచి బాబును పోలీసులు స్వాధీనం చేసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. సత్యనారాయణ, సన్నికుమార్ పాండేలను మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను డీసీపీ అభినందించారు.

జర్నలిస్టులకు నేడు ఉచిత వైద్య శిబిరం

అల్విన్‌కాలనీ: రామ్‌దేవ్‌రావ్ ఆసుపత్రిలో జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరం, ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి సీఈఓ డాక్టర్ యోబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆసుపత్రిలో శిబిరం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

బీసీ కమిషన్ చైర్మన్‌కు ఆహ్వానం అందజేత



మోతీనగర్: మహా శివరాత్రి పూజా కార్యక్రమాలకు హాజరు కావాలని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం ప్రసన్నవేంకటేశ్వర స్వామి ఆలయ కార్యనిర్వాహణాధికారి గుమ్మడిదల సుధాకర్, ఆలయ అర్చకులు ఆహ్వానపత్రం అందజేశారు.

జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు



టాస్ వేస్తున్న మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు

మూసాపేట: కేపీహెచ్‌బీకాలనీ 9వ ఫేజ్ గ్రౌండ్‌లో తెలంగాణ జాగృతి స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్‌ను మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ మూసాపేట డివిజన్ అధ్యక్షుడు జిల్లా అక్షయ్, నాయకులు సుకుమార్, అహ్మద్, వర్షిత్, రాధ తదితరులు పాల్గొన్నారు.

మసీదుల్లో నీటి వసతి కల్పించాలని వినతి



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సెంట్రల్ అల్లాపూర్ మసీద్ ఏ ఒబేద్ హిలాల్, జిలాల్, పద్మావతి నగర్, మదీనా మసీద్, సఫ్దార్ నగర్ మసీదు ఏ చాంద్ బి సాయెబా మసీదుల్లో తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. ఈ మేరకు మంగళవారం రాబోయే రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కార్పొరేటర్ సబిహా బేగంకు ఆయా మసీదుల అధ్యక్షులు వినతిపత్రం అందజేశారు.

టీవర్క్స్‌లో ఫ్లాష్‌మాబ్

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీవర్క్స్‌లో కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. దాదాపు 1000 మంది విద్యార్థులు, యువత చిత్రాలను తిలకించారు. టీవర్క్స్, ఆర్టిజన్స్ ఫ్లీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఫ్లాష్‌మాబ్‌లో విద్యార్థులు, యువత నృత్యాలు ఆకట్టుకున్నాయి, కాగా కళలు, కథలు, ప్రదర్శనలు, సృజనాత్మక అంశాలపై గీతాభాస్కర్, హరీష్ భాగవతులు, ఇషాక్‌జియా, ప్రియత మ్‌లతో చర్చా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఇంటి తలుపు కొడితే.. దాడి చేశాడు..

బంజారాహిల్స్: ఇంటి తలుపు కొట్టాడనే నెపంతో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటగిరి శివాస్ దివ్యహైట్స్‌లో నివాసం ఉండే భోగి విక్రమ్ సోమవారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో కార్యాలయానికి వెళ్లేందుకు లిఫ్ట్ వద్ద వేచి చూస్తున్నాడు. అదే సమయంలో అదే అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే హకన్ అనే వ్యక్తి విక్రమ్ వద్దకు వచ్చి తన ఇంటి డోర్ ఎందుకు కొట్టావంటూ ప్రశ్నించాడు. తాను కొట్టలేదని చెప్పినా వినిపించుకోకుండా విక్రమ్‌పై హకన్ దాడి చేసి ఇంట్లోకి వెళ్లిపోయాడు. అనంతరం ఈ విషయాన్ని విక్రమ్ తన భార్యకు చెప్పి జాగ్రత్తగా ఉండాల్సిందిగా సూచించి ఆఫీసుకు వెళ్లిపోయాడు. లిఫ్ట్ వద్ద జరిగిన విషయాన్ని విక్రమ్ భార్య వారి ఇంటి ఎదురుగా ఉన్న మహిళతో మాట్లాడుతుండగా హకన్ మళ్లీ బయటకు వచ్చాడు. విక్రమ్ భార్యతో హకన్ వాగ్వాదానికి దిగి బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో హకన్‌తో తన భార్యకు ప్రాణహాని ఉందని, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విక్రమ్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేడుకగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



విద్యుత్ కాంతుల ధగధగలతో జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయం



బంజారాహిల్స్: కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవ శోభతో జూబ్లీహిల్స్ మెరిసిపోతోంది. జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీవారి ఆలయంలో 5వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పూజల్లో భాగంగా తొలిరోజు సాయంత్రం బ్రహ్మోత్సవ అంకురార్పణ పూజాదికాలను తిరుమల నుంచి విచ్చేసిన అర్చకులు నిర్వహించారు. స్వామివారి పూజల్లో పాల్గొనేందుకు శ్రీవారి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. బ్రహ్మోత్సవ వేళ శ్రీవారి ఆలయం విద్యుత్ కాంతులతో ధగధగలాడింది.



అంకురార్పణ పూజలు చేస్తున్న అర్చకులు